క్లుప్తంగా

జమ్మాపూర్ వాసికి డాక్టరేట్



పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీ.శే.ఎర్రం పుల్లమ్మ, శేషయ్య కోడలు సీహెచ్ మమత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 'కోవిడ్ మహమ్మారికి ముందు, తరువాత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగుల నిలుపుదల వ్యూహాలపై తులనాత్మక అధ్యయనం' గూర్చి ప్రొఫెసర్ వి.శేఖర్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గ్రామంలో మొదటి మహిళ మమత డాక్టరేట్ పట్టా పొందడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద సీసీ రోడ్డు పనులకు శనివారం మాజీ ఎంపీటీసీ కురుమూర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనుల నాణ్యతగా చేపట్టాలని వారు కాంట్రాక్టర్‌కు సూచించారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్: పాకిస్తాన్ టెర్రరిస్టులు పహల్గాంలో జరిపిన మారణకాండకు ప్రతీకారంగా భారత రక్షణ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయానికి, సైనికులకు మద్దతుగా ఆదివారం జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తిరంగా ర్యాలీ జిల్లా కన్వీనర్ పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీకి ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. సాయంత్రం 4గంటల నుంచి ప్రారంభమయ్యే తిరంగ ర్యాలీకి భారతీయ జనతా పార్టీ శ్రేణులు, కుల, ప్రజా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాల సభ్యులు హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



ఖిల్లాఘనపురం: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 45 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియన్ రెడ్ క్రాస్ వారికి అప్పగించినట్లు ఫౌండర్ కాగితాల మధు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు ఎస్ఎల్ మురళీకృష్ణ, బుచ్చిబాబుగౌడ్, ఆగారం ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టి, సమాజంలో ఉన్నతంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మహేందర్, మునగాల బాబు, యువకులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై చర్యలు ఏవి?

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసిన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారని శనివారం గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు తహసీల్దార్ సుగుణను కలిసి ప్రశ్నించారు. ఈ విషయమై వారు మరోమారు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ఓ వ్యక్తి రూ.లక్షలు వసూలు చేసి, మోసం చేశారని వారు ఆరోపించారు. ఈ విషయమై ఈ నెల 3న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాజాగా తహసీల్దార్ సుగుణ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడిసె ప్రేమ్‌కుమార్, మహేష్, కుర్మయ్య, గోపాల్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడు, జానకీరాములు, మాసయ్య, కె.భరత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కొత్త లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సులభతర బోధనలు చేపట్టాలి

- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ
- బడి బాటను విజయవంతం చేయాలి



జిల్లా కేంద్రంలో శిక్షణ శిబిరంలో భాగంగా టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌తో శిక్షకులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతర బోధన చేపట్టాలని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు ఉపాధ్యాయులకు సూచించారు. ఆత్మకూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లు రియాజుద్దీన్, ఉమాశంకర్, నారాయణ, గీతారాణి, భాస్కర్, కిరణ్, విజయ్, శాంతన్న అమరచింత, ఆత్మకూర్ మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపై, ఎఫ్ఎల్ఎన్ అమలు, బోధనా విధానంలో మార్పులు, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించుట, ఏఐ మూల్యాంకన పద్ధతులు తదితర విషయాలపై క్లుప్తంగా అవగాహన కల్పించారు.

టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరం శనివారం 5వ రోజుకు చేరుకుంది. ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు బోధనాభ్యసన సామగ్రి తయారీ, తరగతి గదిలో దాని ప్రాముఖ్యత అనే అంశంపై డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఐ.సుదర్శన్‌రావు, శ్రీనివాసులు, మల్లేష్‌కుమార్ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్పీ ఐ.సుదర్శన్‌రావు బోధనోపకరణాల తయారీలో మెలకువలు, ప్రయోగశాల ఉపయోగించే పద్ధతులు, బోధనలో డిజిటల్ పద్ధతులు, ఐసీటీ టూల్స్, సైన్స్ బోధనకు ఉపయోగపడే వెబ్‌సైట్‌లను ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. కార్యక్రమములో ఏఎంఓ మహానంది, సెంటర్ ఇన్‌చార్జ్ జ్యోతి, టీబీఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా ఐదు రోజుల పాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా నేర్చుకున్న బోధనా నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలన్నారు. దీంతో పాటు త్వరలో నిర్వహించే బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు.



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు



ఆత్మకూర్‌లో..

జూనియర్ కళాశాల కలేనా..



అమరచింత శివారులో సబ్‌స్టేషన్ సమీపంలో జూనియర్ కాలేజీ నిర్మాణం కోసం గుర్తించిన స్థలం

అమరచింత: ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తూ స్థానిక విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందే తప్పా ఇప్పటికీ మండల కేంద్రంలో కళాశాలను మంజూరు చేయలేక పోయింది. జిల్లాల పునర్విభజన సమయంలో కొత్తగా అమరచింత మండలం ఏర్పడి నేటికీ ఏడేళ్లు గడుస్తున్నా పాలకులు, అధికారులు ఇక్కడి కళాశాల నిర్మాణం గురించి ఆలోచించట్లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టణ శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించి, అక్కడే జూనియర్ కాలేజీ నిర్మిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కళాశాల ఏర్పాటు మరుగునపడింది.

ఆరు ఉన్నత పాఠశాలలు..

మండలంలో అమరచింత, మస్తీపురం, ఈర్లదిన్నె, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో మొత్తంగా ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది నాలుగు నుంచి ఆరు వందల వరకు విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్ కోసం గద్వాల, ఆత్మకూర్, వనపర్తి, మహబూబ్‌నగర్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. పేద విద్యార్థులు ఆత్మకూర్‌లోని జూనియర్ కళాశాలలో చదువుకునేందుకు వెళ్లినా.. సీట్ల కొరత కారణంగా అడ్మిషన్లు దొరకక చదువులకు దూరమై ఇంటి పనులకు పరిమిత మవుతున్న పరిస్థితులు దాపరించాయి.

చదువుకు దూరమవుతున్నారు



ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలేజీ కోసం స్థల సేకరణ చేపట్టి నిధులు మంజూరు చేయకుండా వదిలేశారు. దీంతో మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాల్సి వస్తోంది. ఎమ్మెల్యే చొరవ చూపి జూనియర్ కాలేజీ మంజూరు చేస్తూ, ఈ విద్యా సంవత్సరంలోనే ఇంటర్ తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు, పీడీఎస్‌యూ

లలిత కళల్లో పట్టు సాధించాలి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: విద్యార్థులు చదువు తోపాటు లలిత కళల్లో పట్టు సాధించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన సందర్శించారు. చిత్రలేఖనం, పేరిణి నృత్యం, జానపద నృత్యాలు, సంగీతం శిక్షణా శిబిరాలను ఆయన తిలకించారు. శిక్షణకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన ట్రైనర్స్‌తో క్యాంపు ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న రంగాల్లో ప్రతిభ చాటుకొని, మంచి పేరు సాధించాలన్నారు. మంత్రి వెంట రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, నాయకులు మేకల నాగరాజు, ఎక్బాల్, సురేష్, పుట్టపాగ రాము తదితరులు ఉన్నారు.

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

కొల్లాపూర్: మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పెద్దమల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాదాసి, మాదారి కురువలు ఎస్సీ జాబితాలో ఉన్నప్పటికీ కొల్లాపూర్ నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు దశాబ్దాలుగా తమకు బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారన్నారు. రాజ్యాంగబద్ధంగా తమకు లభించిన రిజర్వేషన్లను కాలరాస్తున్నారని ఆరోపించారు. మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీచేసినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికార యంత్రాంగం తీరుపై న్యాయపరంగా పోరాట చేస్తామన్నారు.

గన్నీబ్యాగుల లేక అవస్థలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని సింగిల్ విండో, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనగోలు కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. గన్నీ బ్యాగులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో ధాన్యం తూకం చేయకుండా కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అధికారులు పట్టించుకొని గన్ని బ్యాగులను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ

కోడేరు: మండలంలోని జనుంపల్లి, నాగులపల్లి, నాగులపల్లి తండాలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో మొక్కలు ఎండిపోకుండ జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురుగు కాల్వలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, పాల్గొన్నారు.

బోరు మోటార్ల వైరు చోరీ

గోపాల్‌పేట: బోరుమోటారు వైర్లు చోరీకి గురయ్యాయని రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని గోపాల్‌పేట ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఏదుల మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన రంగస్వామి ఏదుల రిజర్వాయర్‌లో బోరు మోటారు ఉంచి అక్కడి నుంచి తన పొలానికి నీరు పారించుకునేవాడు. కానీ శనివారం బోరు మోటారు నడవడం లేదని వెళ్లి చూడగా.. అప్పటికే బోరు మోటారుకు ఉండే వైరు చోరీ గురైందని గుర్తించాడు. తన వైరుతో పాటు పక్కన ఉండే రైతులు మల్లేష్, కొమ్మురాములు, తిరుపతిరెడ్డికి చెందిన బోరుమోటారు వైర్లు కూడా దొంగిలించారని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. శనివారం మోట్లంపల్లిలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ద్వారా రూ.12 వేలు ఇవ్వాలని, ఎండలో పనిచేస్తున్న కూలీలకు కేవలం రూ.వంద మాత్రమే వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస కూలి రూ.300 ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తక్కువ నిధులను కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు అవసరం ఉండగా కేవలం రూ.83 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాలో ఉపాధికూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

శ్రీరంగాపురం తహసీల్దార్‌గా రాజు

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల నూతన తహసీల్దార్‌గా రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మురళీగౌడ్ పెబ్బేరు మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వనపర్తి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేసిన రాజు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పెబ్బేరు తహసీల్దార్‌గా మురళీగౌడ్

పెబ్బేరు మండల నూతన తహసీల్దార్‌గా మురళీగౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ లక్ష్మి జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో శ్రీరంగాపురం తహసీల్దార్ మురళీగౌడ్ పెబ్బేరుకు బదిలీపై వచ్చారు.

మహిళ అదృశ్యం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం పట్టణానికి చెందిన కేశపాగ శాంతమ్మ ఈ నెల 11 నుంచి కనిపించడం లేదని ఆమె కుమారుడు కేశపాగ రాములు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు శ్రీరంగాపురం పట్టణానికి చెందిన కేశపాగ శాంతమ్మకు ఐదేళ్ల నుంచి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కేశపాగ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటు



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్

పాన్‌గల్: పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ బృందంతో కలిసి శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో బడిబాట కార్యక్రమంపై రూపొందించిన ఆడియో వాయిస్ రికార్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతుందని, బడుల బలోపేతానికి ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించిందన్నారు. శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందిస్తున్న ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చదివించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సహకరించాలని ఎంఈఓ శ్రీనివాసులు కోరారు. అంతకుముందు శిక్షణ సమావేశం నుంచి ఉపాధ్యాయులు ర్యాలీగా బస్టాండ్ చౌరస్తాకు చేరుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవికుమార్, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యం చేయాలని సీహెచ్ఓ రామయ్య వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్‌లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీకాలను సకాలంలో వేయించుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుంది అని తెలుసుకోవడానికి మాతా శిశు సంరక్షణ కార్డు (ఎంసీహెచ్) వ్యాక్సినేషన్ పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు తారాశశాంక్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శిక్షణలో ఉపాధ్యాయులకు మెళకువలు



మాట్లాడుతున్న ఎంఈఓ జయశంకర్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు ఇచ్చిన శిక్షణలో మెళకువలు నేర్పించినట్లు ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల కార్యక్రమం శనివారం ముగిసింది. తెలుగు, గణితం, ఆంగ్లంతో పాటుగా ఈవీఎస్‌పై ఆర్పీలు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు మహేష్, రాకేష్, అక్తర్, జానకీరాం, మద్దిలేటి, బాలమ్మ, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల కాల్వలో పేరుకుపోయిన పూడిక



అమరచింత శివారులో ఎత్తిపోతల కాల్వ పరిస్థితి



సింగంపేట శివారులో..

అమరచింత: అమరచింత ఎత్తిపోతల పథకం కాల్వలో పూడికతో పాటు చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగడంతో సాగునీరు ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టు అమరచింత, ఆత్మకూర్ మండలంలోని మస్తీపురం, పాంరెడ్డిపల్లి, ఖానాపురం, సింగంపేట, మూలమళ్ల గ్రామాల మధ్య విస్తరించి సుమారు 2,400 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ కాల్వలో పూడిక పేరుకుపోవడంతో కేవలం 1200 నుంచి 1400 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించగలుగుతున్నామని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. పూడికతీత పనులను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలంటూ ఉమ్మడి మండలాల ఎంపీడీఓలకు ఆయకట్టు కమిటీ రైతులు వినతిపత్రాలు అందించినా నేటికి పూడికతీత పనులు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఒరిగిన హైమాస్ట్ లైట్లు



ఒరిగిన హైమాస్ట్ లైట్లు

అమరచింత: పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఒరిగి కిందపడేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల స్తంభం పైభాగం తుప్పుపట్టడంతో చుట్టు ఉన్న లైట్ల బరువుకు వంగిపోయాయి. ఎప్పుడైన కిందపడే ప్రమాదం ఉండటంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒరిగిన హైమాస్ట్ లైట్లను తొలగించాలని కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే జయరాములుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గొర్రెల కాపరుల సంఘం నాయకులు



మాజీ ఎమ్మెల్యే జయరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి విద్యావిభాగం: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములు వర్ధంతి సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో జయరాములు కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నేతలు, బీసీ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే జయరాములు చేసిన ప్రజాప్రయోజన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నాయకులు భావోద్వేగానికి గురయ్యారు. అవినీతికి తావులేకుండా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో కళాకారుడు రాజారాంప్రకాష్ బృందం, గంధం నాగరాజు, ఖాదర్ బాషా, వెంకటేశ్వర్లు, గొనికాడి యాదయ్య, గొల్ల శంకర్, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, కృష్ణయ్య, శ్రీనివాసులు, సురేష్, రాముడు, నాగరాజు, రామస్వామి, శ్రీను, రాములు, నక్క కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, శ్రీశైలం, మేకల అశోక్, రామస్వామి, కురుమూర్తి, నాగరాజు, సాయి యాదవ్, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

వనపర్తిటౌన్: స్వతంత్ర సమర యోధుడు, వనపర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత జయరాములు చేసిన సేవలు మరిచిపోలేనివని గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు కురుమూర్తియాదవ్, మాజీ కౌన్సిలర్ నాగన్నయాదవ్ అన్నారు. శనివారం జయరాములు వర్ధంతిని పురస్కరించుకొని గొర్రెకాపరుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటయ్య యాదవ్, గుండెల తిరుపతయ్య యాదవ్, మెంటేపల్లి రామకృష్ణ, ఎరుపుల వెంకటేష్‌యాదవ్, మన్యంయాదవ్, గొర్ల చంద్రయ్య, రాజాపేట తిరుపతి, రొట్టెల తిరుపతయ్య, పోతులపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.